# పడగ్గది

**-పెద్దూరి వెంకటదాసు**

**శి**వచైతన్య మనస్సు దూదిపింజలా గాలిలో తేలియాడు తుంది.

ఆ ఆనందంలో ఆమె అలసటన్నదే మరచిపోయింది. ఎన్ని పనులు చేసినా ఏదో ఒకటి గుర్తుకువచ్చి స్థిమితంగా కాసేపు కూర్చోలేకపోతుంది.

ఆ ఆనందానికి హడావిడికి కారణం ఒక ఫోన్ కాల్.

"మమ్మీ నేను శిరిని. మీ అల్లుడు గారు, నేను రేపు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వస్తున్నాము. వచ్చిం తర్వాత కబుర్లన్నీ... ఒకేనా మమ్మీ"

పెళ్లయి కొత్తగా కాపురానికి వెళ్లిన తర్వాత మొదటి సారిగా వస్తుంది కూతురు భర్తతో కలిసి.

కూతుర్ని పండక్కి తీసుకురావడానికి వెళ్లిన భర్త వట్టి చేతులతో వచ్చేసరికి ఎంతో ఆత్రుతగా కూతురి రాకకోసం ఎదురు చూస్తున్న శివచైతన్యకు నోట మాట రాలేదు.

"అబ్బాయి లీవుకు అప్లయ్ చేసుకున్నాడట. సెలవు దొరికిన వెంటనే భార్యాభర్తలిద్దరూ కలిసి వస్తామన్నారు" చెప్పదలచుకున్నది క్లుప్తంగా చెప్పేశాడు రాఘవరావ్ భార్యకి.

తను కూడా మొదటిసారి కూతురింటి గడప తొక్కుతున్నప్పుడు పరీక్ష హాల్లోకి ఎంటరయ్యే విద్యార్థిలా ఎంతో టెన్షన్‌కి గురయ్యాడు రాఘవరావు. క్వశ్చన్ పేపర్ చూసి ఊపిరి పీల్చుకున్నట్టు, కూతురి ముఖం చూస్తూనే ఆయన మనస్సులో ఉన్న యక్ష ప్రశ్నలు గాలికెగిరి పోయాయి.

"ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మైండ్" కూతురి ప్రసన్న మైన మోము అతనిలోని సందేహాలను పటాపంచలు చేసింది.

తరచుగా కూతురు ఫోన్లో కాంటాక్ట్‌లో ఉన్నా ఈ మూడు నెలలు మూడు యుగాలుగా గడిచింది ఆ దంప తులకి.

అల్లుడి వినయ విధేయతలు, మీదుమిక్కిలి భార్యను అతడు పువ్వుల్లో పెట్టి చూసుకోవడం గమనించిన రాఘవరావు మురిసిపోయాడు. కూతురు తండ్రికిష్టమని చేసిన మినప గారెలు, బెల్లం పాయసం తృప్తిగా ఆరగించి పడుకుని, ఆ మర్నాడే హైదరాబాద్ బయలుదేరాడు. తను బలవంతం చేస్తే తనతోపాటు కూతురు వచ్చేసేదే. మొదటిసారి ఇద్దరం కలిసి వస్తేనే బాగుంటుందన్న కూతురు ఆంతర్యాన్ని గ్రహించిన రాఘవరావు మరి మారు మాట్లాడలేదు. అల్లుడు కూడా 'శిరీషను మీతోపాటు తీసుకెళ్ళండి మామగారు' అని చెప్పినా ఆమెను వెంట తీసుకురాకపోవడానికి కారణం అదే అని వస్తూనే భార్యకు చెప్పాడు.

❍ ❍ ❍

ఆఫీసు పనిలో నిమగ్నమైన రాఘవరావు ఫోన్ మోగితే ఎత్తాడు.

"హల్లో! ఏవండీ.. నేను..."

"చెప్పు శివా"

"అమ్మాయి, అల్లుడుగారు రేపు విశాఖకి బయలుదేరి వస్తున్నారట. ఇందాకే ఫోన్ చేసి చెప్పింది అమ్మాయి."

'ఎంతో అత్యవసరమైతే తప్ప ఆఫీసుకు ఫోన్ చేయొద్దు' అన్న భర్త మాట ఆమెకాక్షణంలో గుర్తుకురాలేదు ఆనం దంలో.

'కాసేపటి క్రితమే తనకు అమ్మాయి ఫోన్‌చేసి చెప్పింది' అని చెబుదామనుకున్నాడు. కానీ అంతలోనే భర్త జవాబు కోసం ఎదురు చూడకుండానే ఫోన్ పెట్టే సింది శివచైతన్య.

కాలం ఆగని అలలాంటిది. వాళ్లొచ్చే టైమ్ రానే వచ్చింది.

అల్లుడు, కూతురు రావడంతో ఆ రోజంతా క్షణంలా ఎలా గడిచిపోయిందో, తల్లీ కూతుళ్లు ఏకాంతంగా అలా డాబా మీద ఎంతసేపు కబుర్లు చెప్పుకున్నారో, మూడ్నెళ్ల వాళ్ల దాంపత్య జీవితంలో పెనవేసుకున్న ఎన్నో సంఘ టనలు ఎలాంటి దాపరికాల్లేకుండా కూతురు మనసు విప్పి చెబుతుంటే ఆ తల్లి మనస్సు పరవశంతో పులకించి పోయింది. పట్టుమని పదిరోజులు కూడా పెళ్ళి నాటికి ఇల్లు వదలని తన గారాల పట్టి మూన్నెళ్ల తర్వాత ఇలా ఎదురుగా కన్పించి చల్లని కబుర్లు చెబుతుంటే ఏ తల్లి మాత్రం తన్మయత్వంలో మురిసిపోదు.

ఆ రాత్రికి అందరూ కలిసి ఆనందంగా భోజనాలు ముగించాక అన్నీ సర్దుకుని శివచైతన్య బెడ్‌రూం చేరేసరికి చాలా సమయం పట్టింది. కూతురు చెప్పిన కబుర్లన్నీ ఎప్పుడెప్పుడు భర్త చెవిలో వేయాలా అని తొందర తొంద రగా పని ముగించుకుందామని ఎంత ప్రయత్నించినా తెమలలేదు.

❍ ❍ ❍

రాఘవరావు సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్.

ఎల్‌డిసిగా కెరీర్ ప్రారంభించి కష్టపడి పైకొచ్చిన వ్యక్తి.

క్రమశిక్షణకి మారుపేరైన రాఘవరావు గారంటే అందరికీ గౌరవ భావమే.

శివచైతన్య కాపురానికొచ్చిన తొలి రోజుల్లో అద్దె ఇంట్లో, ఇంటి ఓనర్స్ పెట్టే షరతులు, ఏయేటి కాయేడు పెరుగుతున్న అద్దెలు కట్టలేక ఎలాగైనా సొంత గూడొకటి సమకూర్చుకోవాలని భార్య చెవిలో పోరుపెడుతుంటే భరించలేక హౌస్ లోన్‌కు అప్లై చేసి చివరకు ఎలాగైతేనేం డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ మాత్రం కొనగలిగాడు. మొదట్లో ఏమిటీ అపార్ట్‌మెంట్ లైఫ్, ఇండిపెండెంట్ హౌస్ అయితే ఎంచక్కా పెరట్లో రకరకాల మొక్కలు పెట్టుకోవచ్చు. కళ్ళాపు చల్లి ముగ్గుపెట్టి ఇంటిని చూడముచ్చటగా అలంకరించుకోవచ్చు అని భర్త ముందు ఏకరువు పెట్టేది. కానీ రాను రాను ఆమెకి అర్థమైంది. భర్త తీసుకున్న నిర్ణయం సరైందేనని. ఇప్పుడైతే అది కూడా కొనేవాళ్ళం కాదని, ఆకాశాన్నంటుతున్న ఫ్లాట్ల ధరలను చూసి. భర్త ఏం చేసినా దానికర్థముంటుందని కాలక్రమేణా ఆమెకి అర్థమైంది. అసరముంటేనే తప్ప ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడని సింపుల్ వ్యక్తి. ఎప్పుడూ సాదాసీదాగా కని పించే రాఘవరావును కదిపితేనే అతని గొప్పతనం తెలిసేది.

"శిరి అల్లుడు గారిని లేపి స్నానానికి ఏర్పాట్లవి

## బాల్యం.. ఇంద్రజాలం

**లే**తప్రాయపు స్వేదం చూడు..
అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర
శివకాశి కార్ఖానా ముసుగులోంచి
మీ చిన్నారుల మొహాల్లో
మోదంగా మారిపోయింది..
మతాబులా వెలిగిపోయింది..
చిచ్చుబుడ్డిలా రంగు రంగుల పూలని విరజిమ్ముతూ
అంతలోనే నేలకి రాల్తూ..
లేత ప్రాయపు బాల్యం చూడు..
రైల్వే స్టేషన్లలో.. బస్టాండుల్లో..
రెడ్‌లైట్ ఏరియాల్లో.. / చిన్నా చితకా.. చిల్లర మల్లర
పనులు చేస్తో.. మూటలు మోస్తో../ అడుక్కు తింటో..
'ఇచ్చట బాల కార్మికులు లేరు' / వెలుపల బోర్డు
వెక్కిరిస్తుంటే / అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర..
లోపల.. బాల్యం / కప్పులు, పళ్ళాలతో కుస్తీపడుతూ..
పిండి రుబ్బుతూ.. నీళ్ళు మోస్తూ.. నిప్పుల సెగలో
శ్రమని సంపదగా తర్జుమా చేస్తూ..
పెత్తందారీ జేబులు నింపుతు.
నేటి బాలలే రేపటి పౌరులు
రేపటికంటూ.. ఉంటే గింటే
భూగోళానికి రాచపుండులా / ఉగ్రవాదం..
శ్రీలంకో.. శ్రీనగరో / ఇజ్రాయేల్లో.. లెబనానో
ఇరాకో.. ఇరానో.. / ఆఫ్ఘనిస్థానో.. పాకిస్తానో..
ఖబరిస్తానో.. / బుడి బుడి అడుగులు బుగ్గవుతూ..
మదర్సాల్లో.. పులుల శిబిరాల్లో / పేరేదయితేనేం
పసి హృదయాల్లో.. విషం వంపుతూ.. / ఆర్ద్రత స్థానే..
అగ్గి నింపుతూ.. / అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర..
చూడు.. చూడు.. / మానవుడిని దానవుడిగా మార్చే
వైనం చూడు.. / రాక్షసత్వం.. రక్కసి తత్త్వం
ఎక్కడబడితే.. అక్కడ చూడు..
ఆటోనిండా.. అన్నెం పున్నెం ఎరుగని పాపలు
క్షేమంగా.. ఇల్లు చేరడం ఇంద్రజాలం
చదువుల పేరుతో.. మూటలు మోస్తూ..
పాఠాలను బట్టీయం పెడుతూ.. / మానవీయత
మరుగవుతోంటే / సృజనాత్మకతకి సమాధి కడుతూ..
అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర..
మనిషి.. యంత్రంగ మారే / మాయలు చూడు..
ఈ గారడి చూడు.. / అక్కడ చూస్తే..
ఆకలి.. ఆకలి / ఆకలి.. ఆకలి..
కడుపో.. వీపో తేడా తెలియని / ఆఫ్రికా ఖండపు
మృత్యుమొహాల బాలల / ఆక్రందన చూడు..
అబ్రకదబ్ర.. అబ్రకదబ్ర..
భూత.. భవిష్యత్.. వర్తమానాలన్నీ
ఒకటే అయిన వైనం చూడు
ఇంద్రజాలికుడు పి.సి.సర్కార్
మన ఘనాపాటి సర్కారు ముందేపాటి?!
అయినా.. గియినా.. ఏదేమైనా
బాల్యం.. బాల్యం.. బాల్యం.. బాల్యం
పడుతూ.. లేస్తూ.. / రేపటి భవిష్యత్తుకేసి
ఉరకలు వేస్తూ.. పరుగులు తీస్తూ..
బాల్యం.. బాల్యం.. బాల్యం.. బాల్యం
వర్ధిల్లాలి.. ఈ సంకల్పం..
విలసిల్లాలి.. బాల్యపు తేజం..
విజయ పథం.. / పురోగమనపు దిశగా
బాల్యం.. బాల్యం / బాల్యం.. బాల్యం..

**-శ్రీనివాసరాజు**

చూడు. నేను కాసేపట్లో మీ బెడ్‌రూం తుడిచి శుభ్రం చేస్తాను" కూతురి చేతిలోని బకెట్ లాక్కుంది శివచైతన్య.

"మీ అల్లుడుగారు పేపర్ చదువుతున్నారు" అందుకని అంటూ...

"నే తుడిచి సర్దుతాగా మమ్మీ" అంది మళ్లీ.

"అక్కర్లేదమ్మా, అల్లుడుగారిని పేపర్ మా బెడ్‌రూంలో చదువుకోమను. నాన్నగారు పూజగదిలో ఉన్నారు" చెప్పింది కూతురికి శివచైతన్య.

భర్తని పక్క గదిలోకి పంపి తన పనిలో నిమగ్నమైంది శిరీష, మమ్మీ ఇక వినిపించుకోదని-

మొట్టమొదటిసారి మామగారి బెడ్‌రూంలోకి ఎంటరైన శ్రీకాంత్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. అందులోని కళాఖండాలు, వాటిని అమర్చిన తీరు చెప్పాలంటే తన మనస్సులో బెడ్‌రూం అంటే ఏవిధంగా ఉండాలో, అందులోకి వెళితే ఎలాంటి ఆహ్లాదం కలగాలో.. ఆ విధంగా తీర్చిదిద్దబడి ఉందాగది. తెల్లటి పాలరాతి ఫ్లోరింగ్. ఎక్కడా ఏ చిన్న మరకా లేకుండా శుభ్రంగా ఉంచడం ఒక ఎత్తయితే, అంతే అందంగా రోజ్‌వుడ్‌తో చేయించిన డబుల్‌కాట్‌పై మల్లెపువ్వు పద్దా మరకపడే ఫోమ్ బెడ్‌పై పరచిన శ్వేతవర్ణం బెడ్‌షీట్, అటాచ్డ్ బాత్‌రూంలో అమర్చబడిన అధునాతనమైన టైల్స్-

బెడ్‌కు ఒకవైపు ఈజీచైర్. ఆ పక్కనే అందంగా పుస్తకాలతో అలంకరించబడిన ర్యాక్. అందులో ఆది కావ్యం రామాయణం మొదలు వాత్సాయన కామసూత్రాలు, రామ్‌దేవ్‌బాబా యోగాసన పుస్తకాల వరకు దేన్నీ వదలకుండా అన్నీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దబడిన తీరు-

మంచానికెదురుగా ఓ మూల పి.సి., ఆ పక్కన లేటెస్ట్ డివిడి ప్లేయర్, రకరకాల సి.డి.లు- బిస్మిల్లా ఖాన్ షహనాయ్ నుంచి బాలు భగవద్గీత వరకు ఇండెక్స్ బాక్స్‌లో అమర్చిన తీరు.. ఒకటేమిటి అందులో లేని సౌకర్యమంటూ లేదనడం సబబేమో. సాదాసీదాగా కనిపించే సోడాబుడ్డి కళ్ళద్దాల మామగారికి ఇంతటి కళా హృదయముందని ఎవరైనా ఊహించగలరా! మయసభా భవనంలోకి అడుగిడిన దుర్యోధనుడిలా శ్రీకాంత్ మామగారి గదిలోకెళ్ళి తన్మయత్వంతో మైమరచిపోయాడు.

భార్య కాఫీ కప్పుతో వచ్చి చేతికిచ్చేవరకు మళ్లీ మామూలు మనిషి కాలేకపోయాడు.

మధ్యతరగతికి చెందిన మామగారు తన అభిరుచికి తగ్గట్టుగా ఇంత అధునాతనంగా తన బెడ్‌రూమ్‌ని తీర్చిదిద్దుకున్నాడంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. కానీ, రాఘవరావుకు కొన్ని ప్రిన్స్‌పుల్స్ వున్నాయి.

అందరిలా ఆలోచించేవాడయితే, లక్షలు పోసైనా ఏ ఇంజనీర్నో, డాక్టర్నో అల్లుడిగా చేసుకోగలిగేవాడు. ఆ దిశగా అతని ఆలోచన లేదు. లక్షణంగా భార్యను పోషించగలిగే సాధారణ ఉద్యోగయితే చాలనుకున్నాడు. బ్యాంక్ అకౌంటెంట్‌గా పనిచేసే శ్రీకాంత్‌ని అల్లునిగా చేసుకున్నాడు.

ఒక్కగానొక్క కొడుక్కి ఎపిఆర్‌జెసిలో సీటొస్తే రపీమని అందులో చేర్పించాడు. కార్పొరేట్ కళాశాలలో చదివించి వేలకి వేలు డబ్బును వృధా చేయడం అతని మనస్సుకి నచ్చలేదు. కొడుకు తమకు దూరంగా వెళ్లాల్సి వచ్చినా కాంప్రమైజ్ కాలేదు. అలాగని అతడేనాడు తన అభిప్రాయాల్ని ఇతరులపై బలవంతంగా రుద్దలేదు. నిర్ణయం మాత్రం భార్యా, పిల్లలకు అంగీకారమైతేనే అమలు చేసేవారు.

పెళ్లయిన కొత్తలో శివచైతన్యకు అతని వాలకం ఏమాత్రం అర్థమయ్యేది కాదు. తొలిరాత్రి... ఆమె బెడ్‌రూంలోకి ఎంటరైనప్పుడు-

"శివా! ఒక్క విషయం మాత్రం ఎప్పటికీ గుర్తుంచుకో. మనుషులు కలవడం కాదిక్కడ, మనసులు కలవాలి. ఇది ఒక పవిత్రమైన దేవాలయం. మనిషి మాత్రమే కాదు- మనసు పరిశుభ్రంగా ఉండాలిక్కడ. దయచేసి ఎప్పుడు నీవు ఈ దేవాలయంలో అడుగుపెట్టినా నీకున్న సమస్యల్ని, బాధల్ని గడపవతలే వదిలిరా!

అవసరమైతే నేనే గుమ్మం దాటి వస్తాను. బాధలను మరచిపోవడానికే ఈ స్థలం అని నమ్మిన వాడిని నేను. నా జీవిత భాగస్వామి కూడా అలాగే ఉండాలని కోరుకోవడంలో తప్పు లేదనుకుంటా. అందుకే నిర్ణయాన్ని నీకే వదిలేస్తున్నా-"

ఆనాటి నుంచి భర్త మాటే వేదమైంది. ఆ మాటలే పరమౌషధంలా తన మనస్సుపై పనిచేశాయని నమ్మింది శివచైతన్య.

"ఏవండీ! స్నానానికి వేన్నీళ్ళు రెడీగా ఉన్నాయి. నాన్నగారి పూజ పూర్తయ్యే లోపు మీరు స్నానం చేసిరండి. ఇద్దరికి టిఫిన్ వడ్డిస్తాను. భార్య చెప్పేవరకు శ్రీకాంత్ ఊహాలోకంలోనే విహరించాడు.

"శిరి, ఈ బెడ్‌రూం చూస్తుంటే నాకేమనిపిస్తుందో తెలుసా! 'మనిషన్నాక కాస్త కళాపోషణుండాలోయ్' అన్న సినిమా డైలాగ్ అక్షరాలా నిజమనిపిస్తుంది. మీ నాన్నగారి టేస్ట్ సింప్లీ సూపర్బ్" తమకంతో చెబుతున్న భర్తని ఒకింత ఆశ్చర్యంగా చూసింది శిరీష. ఆమె ఎన్నోసార్లు ఆ రూమ్‌లోకి వెళ్లింది. కాకపోతే ఒళ్లు దగ్గర పెట్టుకుని మసలుకునేది. ఎక్కడైనా, ఏదైనా చిన్న మరక కనిపించినా, ఏ వస్తువు స్థానభ్రంశం చెందినా తండ్రి కోపం ఏ స్థాయిలో ఉంటుందో తను చూసింది. చిన్నప్పుడు తమ్ముడు పాకుతూ వెళ్లి ఫిష్ ఆక్వేరియమ్‌కు అమర్చిన టేబుల్‌కి తగిలి, అది కిందపడి పగిలినప్పుడు- తన అజాగ్రత్తకు అమ్మ భారీ మూల్యాన్నే చెల్లించిందారోజు.

"శిరి! నా మనసులో మాట చెప్పనా? నేను ఏ రకంగా నా బెడ్‌రూం వుండాలని కలలు కన్నానో అక్షరాలా అలాగే ఉందీ గది. యాక్సిడెంటల్‌గా మా ఇద్దరి అభిరుచులు ఇలా కలిశాయేమో" మామగారి నుద్దేశించి అన్నాడు శ్రీకాంత్ భార్యతో.

మళ్లీ తనే అన్నాడు, "నీకు ఇందులో ఎంటరయితే ఏమి అనిపించడంలేదా?" అని.

భర్త చెప్పిన తర్వాత గదినంతా దీక్షతో చూసింది శిరీష మొదటిసారి కొత్తకోణంలో ఓ ఇల్లాలిగా-

"మనం ఈ గదిని చూసే ఇంత పరవశించి పోతున్నాం. ఒక్క రాత్రి ఇందులో గడిపితే ఆ అనుభూతిని మరవలేమేమో" జీవితంలో ఎంత సంపాదించినా 'పడక సుఖం లేని పైకమెందుకు, మనసును సంతృప్తి పెట్టని మనిషి జన్మెందుకు' అన్పించిదతనికి మొదటిసారి. "ఏదైనా రుచి చూస్తేనే కదా దాని మజా తెలిసేది." భర్త లోలోపల గుణుక్కుంటున్నట్లున్నా శిరీష చెవిలో పడిందా మాట.

చిన్నప్పటి నుంచి లెక్కలేనన్నిసార్లు ఆ గదిలో కొచ్చినా, శ్రీమతిగా భర్త పక్కన ఆ మధురానుభూతి కొత్తగా అనిపించింది శిరీషకి కూడా. తండ్రితో పాటు టిఫిన్ చేసి భర్త బయటకెళ్లాక సమయం చూసి తల్లి చెవిలో వేయాలనుకుంది భర్త కోరిక.

తల్లి దగ్గర ఆమెకంత చనువు, స్వేచ్ఛ. వాళ్లిద్దరూ తల్లీ కూతుళ్లా లేక ఫ్రెండ్సా అన్నట్లు మూవ్ అవుతారిద్దరూ. అలాగని తండ్రంటే భయమని కాదు- ఆయన కూతుర్ని ఏనాడు ఓ చిన్న మాట కూడా అనలేదు- పైగా అన్నీ తల్లే చూసుకుంటుంది కదా- తనవరకు రాకుండా అంటూ సంతోషపడేవాడు రాఘవరావు.

"ఏమ్మా! ఏంటీ అదోలా వున్నావు? అబ్బాయితో పాటు నువ్వూ బయటకు వెళ్లలేకపోయావా. పాపం అతనికూడా కాస్త తోడుగా ఉండేదానివి" కూతుర్ని కదిపింది శివచైతన్య.

"నీతో ఏకాంతంగా గడపాలనే ఆయన నన్ను ఇంట్లో ఉండిపొమ్మన్నారమ్మా" అంది శిరీష.

"మీ నాన్నగారు వైజాగ్ నుంచి వచ్చిన రోజే, ఆయన ముఖమే చెప్పింది అల్లుడు నిన్ను ఎంత బాగా చూసుకుంటున్నాడో"

తల్లి మాట్లాడుతూనే ఉంది కానీ, శిరీష మనసు ఏదో ఆలోచిస్తుంది. ఇంత సంతోష సమయంలోనూ చిన్న అసంతృప్తి. భర్త కోరిక ఎలా తల్లి చెవిలో వేయాలా అని.

"ఏమిటీ.. నీకీవేళ ఏమయింది? ఏదో ఆలోచిస్తూ అదోలా కన్పిస్తున్నావు. నేను ఉదయం నుంచీ గమనిస్తూనే ఉన్నాను" కూతుర్ని అడిగేసరికి చెప్పింది శిరీష మనసులోని మాట తల్లితో.

గోముగా తల్లి చేతుల్ని తీసుకుని చెంపలకు ఆనించుకుంటూ-

ఈ మాట తల్లితో చెప్పలేక కాదు, నాన్న గురించే.. దానికి కారణం ఉంది.

తనకి బాగా గుర్తు. తను ఇంటర్ చదువుతున్న రోజుల్లో అమ్మ ఫ్రెండ్ ఒకామె స్టేట్స్ నుంచి హైదరాబాద్ వచ్చింది. ఇద్దరూ చిన్నప్పటి నుంచి స్కూల్ ఫైనల్ వరకూ క్లాస్‌మేట్స్. ప్రత్యేకంగా అమ్మ కోసం మా ఇంటికి అడ్రస్ వెతుక్కుంటూ వచ్చింది. నేను కాలేజీ నుంచి రాగానే నన్ను ఆమెకు అమ్మ పరిచయం చేసింది. నాకు పరాయి మనిషిలా అనిపించలేదు ఆమె ఆప్యాయత చూసి.

మావారికి పరిచయం చేస్తాను ఆగవే అని అమ్మంటే ఆమె ఆగిపోయింది. నాన్నగారు రావడం, పరిచయ కార్యక్రమాలు ముగిసి, భోజనాలు వగైరా పూర్తయ్యేసరికి బాగా చీకటి పడింది. ఆ ఒక్క రాత్రికి ఉండమని అమ్మ ఆమెని రిక్వెస్ట్ చేస్తే ఆగిపోయింది. ఆమెకు బెడ్ ఏర్పాట్లలో తలమునకలైన మమ్మీని కలుద్దామని పక్క గదిలోకెళ్లబోయాను. అప్పుడు వినిపించాయి డాడీ మాటలు- కాకతాళీయంగా వింది.

"చూడు శివా! స్నేహానికి నీవెంత విలువిస్తున్నావో నేనర్థం చేసుకోగలను. నీవేం చేసినా నేను కాదనను. కానీ, ఆమె కోసం మన బెడ్‌రూం కేటాయించి, మనం బైట పడుకోవడం నాకు నచ్చని విషయం. అమ్మాయి బెడ్‌రూమ్‌లో అరేంజ్ చెయ్యి. కావాలంటే ఈ బెడ్‌షీట్స్ వగైరా తీసుకెళ్ళు. అయినా నేను ప్రాణప్రదంగా చూసుకునే ఈ బెడ్‌రూం, నా సెంటిమెంట్‌ను నేనొదులుకోలేను.

"నీకు తెలియదా శివా"...

ఆనాటి ఆ మాటలు ఆమె మనసులో మెదిలి శిరీషను ఒకింత ఆలోచించేలా చేశాయి తప్పితే తల్లితో చెప్పలేక కాదు.

మళ్లీ తనే చెప్పింది శిరీష తల్లితో

## గడ్డిపూవు

**అం**దమైన ఏ దృశ్యం చూసినా
నీవే గుర్తుకు వస్తావు!

నేనెంత నీ దగ్గరికి రావాలని ప్రయత్నించినా
నువ్వంత దూరంగా నన్నొదలి పోతున్నావు!

ఎలా అందుకోను నిన్ను?
ఎలా తెలియచెప్పుకోను నన్ను?

నువ్వెక్కడో దూరంగా ఉన్నావు
దేవతల కోవలో ఉన్నావు
ఎవరికీ అందని మహా సౌందర్య ప్రతీకవి నీవు!

నీకేం తెలుస్తుంది నా బాధ?
నేను చెప్పుకోలేను నా వ్యథ!

నీకు అందే భావంలో రాగంలో పలకలేను
నా గుండె మాట్లాడలేదు కాని...
ఏదో అర్థం తెలియని తెగిన వీణతీగల రాగాన్నాలా
పిస్తుంది!

నీకు తెలియచెప్పాలని రంగు రంగుల చిత్రంగా
నా భావాలు సంక్షిప్తపరిచాను - కాని...
ఆ చిత్రం నిండా ఉన్నవి తైలవర్ణాలు కావు
ఇంద్రధనసు రంగులూ కావు
ఏదో తెలియని తెలుసుకోలేని తెలుపు - బూడిద
రంగా అది?

పోనీ శిల్ప ప్రతీకగా మలిస్తే నీ కోసమనుకున్నాను
అయితే - నవ్వుతావు నువ్వా మట్టి ముద్దని చూస్తే!

రాయడానికి కవితగా భాష భావాల్లేవు
మరి మాట్లాడని మూగ మల్లె మొగ్గ ఈ మనసు!

ఎలా నేను చెప్పేది? ఎలా నిన్ను చేరేది? ఎలా
నీలో కలిసేది?
నా గుండెల్లో పిలుపు నీకందదు-
నాకాతరపు అరుపు వినిపించదు!

ఏదో ఒకరోజు
మట్టిలో కలుస్తాను నేను!
'జాతస్యహి ధృవో మృత్యుర్...' కనుక
ఆ తర్వాత నీలో నేనుండాలని నా కోరిక

ఒకవేళ... ఏదీ అవలేకపోయినా
నేను కలసిన మట్టిలోంచి
నన్ను కాల్చిన బూడిదలోంచి
ఏదో ఒక గడ్డిపూవుగా నేను మారనా?

నువ్వొక రోజెప్పుడో అదే దారిలో నడిచినపుడు
నీ పాద ధూళి నా మీదకి ఎగరదా?
అప్పుడనుకుంటాను - నా జన్మ పునీతమయిందని!

-పింగళి భట్టిప్రోలు బాలాదేవి

"మమ్మీ అమెరికానుంచి వచ్చిన శ్రీరంజని ఆంటీ..." మధ్యలోనే అందుకుని తానే పూర్తిచేసింది శివచైతన్య.

"నీ అనుమానం నాకర్థమైంది తల్లీ.. ఆఆంటీ నువ్వూ ఒకటేనా.. అల్లుడిగారి చిన్న కోర్కె.. అయినా నీకు తెలియదా శిరీ, మీ నాన్నగార్కి కూతురంటే ఎంత ప్రేమో!"

"అది కాదు మమ్మీ"

"ఏం లేదు. ఇక నీవా విషయం మరిచిపో నే చూసుకుంటా అన్నీ. లే సాయంత్రమైంది, ముఖం కడుక్కుని తయారవ్వు. అల్లుడుగారు వచ్చేస్తారేమో!" వళ్ళో పడుకున్న కూతుర్ని తట్టి లేపింది శివచైతన్య లాలనగా-

ఆ మాటలయితే అందిగానీ భర్త దగ్గర ఎలా కదిపేది- ఆనాటి ఎక్స్‌పీరియన్స్ మదిలో మెదిలినా- నా బిడ్డకంటే ఎక్కువా! చూద్దాం అనుకుంది. ఇంకా అందంగా ఆ బెడ్‌రూమ్‌కు ఏమి మెరుగులు దిద్దాలి అని ఆలోచిస్తూ మెల్లిగా లేచింది శివచైతన్య.

❍ ❍ ❍

ఆ రాత్రి డైనింగ్ టేబుల్‌పై వంటకాలు సర్దుతుంది భర్త రాకకోసం ఎదురుచూస్తూ శివచైతన్య. 'ఈపాటికే రావాల్సింది. ఈయనెప్పుడూ ఇంతే, ఎదురు చూస్తున్నపుడు ఇంకాస్త ఆలస్యం చేస్తారు' మనసులో గొణుక్కుంటున్నట్టున్నా పైకే అనేసింది శివచైతన్య ఓపిక నశించి.

"ఇప్పుడు ఏం తొందర మమ్మీ. ఏ పనుందో ఏమో డాడీకి" శిరీషకి తెలుసు మమ్మీ ఆరాటం.

అంతలో ఫోన్ మోగింది.

"శిరీ! ఫోన్ ఎత్తమ్మా"

"హల్లో" శిరీషా హియర్. డాడ్.."

"ఆ! అవునమ్మా! శిరి రేపు ఈవెనింగ్ విశాఖకే కదమ్మా మీరు వెళ్లేది.

"యస్ డాడ్"

"మీరు అక్కడే అప్ అండ్ డౌన్ రిజర్వేషన్ చేయించుకున్నారు కదా. మరచిపోయాను. మీ అమ్మేం చేస్తుంది?"

"మమ్మీ! డాడీ ఫోన్"

"హలో.. చెప్పండి"

"శివా! ఏం లేదు, నాకు ఆఫీసులో రేపు ఇన్‌స్పెక్షన్ ఉంది. అందుకే ఈ రోజు నైటంతా ఇక్కడే ఉండి అర్జెంట్ ఫైల్స్ కంప్లీట్ చెయ్యాలి. మా స్టాఫ్‌తో పాటు నేనూ ఉండాల్సొస్తుంది. మీరు భోంచేసి పడుకోండి. మాకు భోజనం ఏర్పాట్లు ఇక్కడే చేశారు, ఓకే" అంటూ కట్ చేశాడు రాఘవరావు భార్యకు మాట్లాడే అవకాశమే లేకుండా.

అంతే! శివచైతన్య ఎగిరి గంతేసినంత పని చేసింది. 'కాగల కార్యం గంధర్వులే నెరవేర్చారని'. "రేపేదో ఇన్‌స్పెక్షన్ ఉందట. నాన్నగారు రావట్లేదట. మనల్ని భోంచేసి పడుకోమన్నారు" చెప్పేసింది టకటకా కూతురికి. ఆమె మనసంతా బెడ్‌రూం సర్దడంలో నిమగ్నమైంది. చివరిగా ఒకసారి వెళ్లిచూసింది అన్నీ సరిగా అమరాయో లేదోనని.

మల్లెపువ్వులా సింగారించిన బాపుబొమ్మ శిరీషకు బుగ్గన దిష్టిచుక్క దిద్ది నుదురు ముద్దాడి బెడ్‌రూమ్‌లోకి పంపి ఆ తర్వాత హాయిగా ఊపిరి పీల్చుకుంది శివచైతన్య.

❍ ❍ ❍

ఊపిరి సలపని పనితో అలసిపోయి పడుకున్న శివచైతన్యకు ఉదయం భర్త వచ్చి తలుపు తట్టేవరకూ మెలకువ రాలేదు. శిరీష మాత్రం ఉదయాన్నే లేచి అలసి పడుకున్న తల్లిని లేపడమెందుకని, తాను స్నానం చేసి తయారై భర్తను లేపుతుంది. అప్పుడు తలుపు తట్టాడు తండ్రి. వెళ్లి తలుపు తీసింది శిరీష. రాత్రంతా నిద్రలేమితో అలసటగా కనిపిస్తున్న డాడీ మొహం చూసి "డాడీ మీరు తయారవ్వండి, నీళ్లు కాచి ఉంచాను. ఆయన్ను తర్వాత లేపుతాను" అంది శిరీష తండ్రి రాగానే.

తలారా స్నానం చేసి, మంచుమీద నీటి బిందువుల్లా మోముపై అక్కడక్కడ తలనుంచి రాలిపడ్డ నీటిచుక్కలు కొత్త అందాన్నిస్తుంటే కడిగిన ముత్యంలా కనిపించే కూతుర్ని తృప్తిగా చూసి, ఏదో జ్ఞప్తికి వచ్చిన దానిలా ముసిముసిగా నవ్వుకుంది శివచైతన్య.

భర్తని సమీపిస్తూనే, "అమ్మాయి ముఖంలో ఆ కళ గమనించారా" అని తన మనసులోని మాట ఎప్పుడెప్పుడు చెప్పాలా అని ఆలోచిస్తూ-

"అదేం! కొత్తగా అడుగుతున్నావు? మన అమ్మాయిది ఎప్పుడూ కళకళలాడే ముఖమే. అదిసరే! అమ్మాయి స్నానం కూడా అయిపోయింది. నీవేంటి మొద్దునిద్ర?"

"నా సంగతికేం గానీ మీరేం గమనించలేదా మార్పు?"

"అమ్మాయిలో ఏమోగానీ నీ మొహంలో కన్పిస్తుంది నాకు ఏదో కొత్త కళ" కాస్త ఉడికించాడామెని రాఘవరావు.

తట్టుకోలేకపోతుందామె యాంగ్జయిటీని.

"ఏవండీ, ఒక్కసారి మీ చెవి ఇలా దగ్గరకు తెండి అంటూ చెప్పేసింది మనసులోని మాట. ముసిముసిగా నవ్వుకున్న భర్తను చూసి ఆమె ఆనందం ఆకాశాన్నంటింది. ఏదో చెప్పాలనుకున్న రాఘవరావు అలాగే ఆగిపోయాడు. భార్య ఆనందాన్ని, ఆమె కళ్ళలో కనిపిస్తున్న ఆ వెలుగును చూసి.

ఆమెకేం తెలుసు, పూజగదిలో నుంచి బైటకు రాబోతున్న తాను, కూతురితో అల్లుడు పడగ్గది గురించి చెప్పిన విషయం కాకతాళీంగా విన్నాడని, అందుకే తాను లాడ్జిలో రూం తీసుకుని వాళ్లకు ఆటంకం లేకుండా చేశాడని-

నిజానికి వాళ్లొచ్చిన రోజే తన బెడ్‌రూమ్‌లో అకామ్‌డేట్ చేయాలనుకున్నాడు కానీ, అమ్మాయి చదువుకున్నప్పటి రూం. అందులో ఆమె తాలూకు జ్ఞాపకాలు భర్తతో పంచుకుంటుందేమోనని చెప్పలేకపోయాడు.

తాను కూతురి అభిరుచి గురించి ఆలోచించాడు కానీ, అల్లుడు అభిరుచి గురించి ఆలోచించాల్సింది. తనే దానికి పరిష్కారం చూపించాలి. ఎబ్బెట్టుగా కాకుండా, స్మూత్‌గా- అందుకే రాత్రంతా దోమలతో యుద్ధం చేస్తూ లాడ్జిలో గడిపాడు. శివచైతన్యకేం తెలుసు ఈ సంగతి.

ఆ విషయం ఆమెతో చెబుదామనుకున్నాడు కానీ, ఆమె కళ్లలో కనిపిస్తున్న సంతృప్తిని చెరిపెయ్యడం ఇష్టం లేక ఆగిపోయాడు రాఘవరావు.

❍ ❍ ❍

యథాలాపంగా వచ్చిన ఓ ఫోన్ రిసీవ్ చేసుకున్న శిరీషకు నాన్న కావాలనే రాత్రి ఇంటికి రాలేదని అర్థమైంది. నాన్నగారి గుండెల్లో తన స్థానమేమిటో శిరీషకి తెలిసింది. తండ్రి మమకారం తలంపుకొచ్చి కారే కన్నీటిని ఆపుకోలేకపోయింది.

వారు విశాఖ బయలుదేరే ముందు తండ్రి ఇచ్చిన కానుక- శిరీషనే కాదు, అల్లుడ్ని కూడా నివ్వెరపోయేలా చేసింది. నూతన దంపతులకు 'వైజాగ్'లో ఖరీదు చేసిన ఫ్లాట్.

■